క్లుప్తంగా

కొత్తపల్లి ఎస్‌ఐగా కేశవ



కొత్తపల్లి: కొత్తపల్లి మండల ఎస్‌ఐగా ఎం.కేశవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఏవరైనా అసాంఘీక కార్యకలపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

వన సంరక్షణ.. మనసంరక్షణ



జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: వన సంరక్షణ మనసంరక్షణ అని ప్రధానోపాధ్యాయులు సలీంబాషా అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(కోట)లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు, అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

నందీశ్వరుడికి మహారుద్రాభిషేకం



నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల(అర్బన్): శ్రావణ బహుళ త్రయోదశి, మహాప్రదోశం సందర్భంగా మహానంది పుణ్యక్షేత్ర గర్భాలయంలో నందీశ్వరస్వామి వారికి మహారుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకరఅవధాని, హనుమంతు శర్మల వేదమంత్రాలతో విశేష ద్రవ్యాభిషేకాలను చేపట్టారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ గావించారు.

పింఛన్ల పంపిణీ



ఆత్మకూరులో పింఛన్లను అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలం, పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. పట్టణంలో 4,318 పింఛన్లకు గాను 3,920 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 90.2 శాతం పింఛన్లను పంపిణీ చేశామని ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు.

పగిడ్యాల: మండలంలో శనివారం లబ్ధిదారులకు అధికారులు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. 4,890 మందికిగాను 4432 మందికి పింఛన్ సొమ్మును అందజేసినట్లు అధికారులు తెలిపారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలానికి సెప్టెంబర్ మాసానికిగాను 5,015 పింఛన్లు మంజూరు కాగా శనివారం సాయంత్రం ఐదు గంటలకు 93.16శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు.

నందికొట్కూరు: పట్టణంలో శనివారం ఎమ్మెల్యే జయసూర్య లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యలకు నిధి గణపతి



ప్రవచనాలు వినిపిస్తున్న ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్: విద్యలకు నిధిగా గణపతిని ఆరాధిస్తారని, అక్షరగణపతిగా ఆ హేరంబుని పూజించి విద్యాబుద్ధులు పొందుతారని అందుకే విద్యార్థులకు కూడా గణపతి అభీష్టదైవమని ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనాలు శనివారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ప్రవాచకులు మాట్లాడుతూ గణపతి మహర్షులకు కూడా సిద్ధి ప్రదాత అన్నారు. వ్యాసమహర్షికి బ్రహ్మదేవుడు గణపతి మంత్రాలను ఉపదేశించాడని, గణపతి అనుగ్రహంతో వ్యాసమహర్షి అష్టాదశ పురాణాలను రాయగలిగాడని చెప్పారు. సందర్భానుసారంగా శ్రీశైలక్షేత్ర మహిమలను కూడా వివరించారు.

దంచికొట్టిన వాన!

- ఉప్పొంగిన వాగులు వంకలు.... నీట మునిగిన పంటలు
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఎద్దులేరు వాగు
- 12 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- పలు కాలనీలు జలమయం



బన్నూరు వద్ద పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

కొత్తపల్లి: వాన దంచికొడుతుంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంటలు నీట మునిగాయి. కాలనీలు జలమయం అయ్యాయి. దీంతో జన జీవనం స్తంభించింది. గువ్వలకుంట్ల గ్రామం, పాలెంచెరువు గూడెంల సమీపంలోని రాయిసెల, గోర్రుసెల కాల్వలు ఉధ్రుతంగా ప్రవహిస్తున్నాయి. గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో వర్షపు నీరు నిలిచింది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. ఎం.లింగాపురం, శివపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. 12 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఎవ్వరూ వాగుదాటకుండా ఏఎస్‌ఐ బాబా ఫక్రుద్దీన్ సిబ్బందితో కలసి పర్యవేక్షించారు. ఎక్కడివారు అక్కడే ఉండాలని, అనవసర సాహసాలు చేయొద్దని ప్రజలకు ఏఎస్‌ఐ సూచించారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పంటలు నీట మునిగాయి. ప్రత్యేకించి మొక్కజొన్న పంటలు దెబ్బతింటాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వీరాపురం గ్రామంలో ఎస్సీకాలనీ జలమయం అయింది. కొత్తపల్లిలో బస్టాండ్ నుంచి మల్లేశ్వరస్వామి ఆలయానివెళ్లే ప్రధాన రహదారి నీట మునిగింది. కొత్తపల్లి నుంచి సంగమేశ్వరం వెళ్లే ప్రధాన రహదారితోపాటు ఎం.లింగాపురం బస్టాండ్‌లో మోకాలిలోతు నీరు చేరింది. ప్రయాణికులు, బాటసారులు, వాహనచోదుకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో శనివారం 38.6 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

36.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతోపాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగి పోర్లాయి. పంటలు నీట మునిగాయి. మండలంలో 36.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నందికొట్కూరు: ఉరుములతో, మెరుపులతో కూడిన భారీ వర్షం శుక్రవారం సాయంత్రం నుంచి కురుస్తుంది. 24 గంటల పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని రహదారులు జలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ కాలనీల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రహదారులను, డ్రైనేజీలను మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు.

పగిడ్యాల: తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా 25.0 మిమీ వర్షపాతం నమోదైనట్లు మండల అసిస్టెంట్ గణాంక అధికారి ఎల్లగౌడ్ తెలిపారు. మినుము, మొక్కజొన్న పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాతో పాటు గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు వాన దంచికొట్టింది. రోడ్లు జలమయం అయ్యాయి. పారుమంచాల ఇసుకవాగు, కాకిలేరు వాగు, సుద్దవాగులు ఉప్పొంగి ప్రవహించటంతో పంటపొలాలు నీట మునిగాయి. 40.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు.

శ్రీశైలం జలమయం

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం నిరంతరాయంగా కురుస్తుండడంతో శ్రీశైలం వర్షపు నీటితో శ్రీశైలంలోని అన్ని కాలనీలు, ప్రధాన పురవీధులు, ఔటర్ రింగ్ రోడ్లన్నీ ఏరులై పారాయి. శ్రావణమాసం సందర్భంగా మల్లన్న దర్శనానికి వచ్చిన యాత్రికులు వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరంతరాయ వర్షం కారణంగా స్వామి దర్శనానికి, తిరుగు ప్రయాణానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా శ్రీశైలం డ్యాంకు సందర్శకుల తాకిడి పెరిగింది. శ్రీశైలం డ్యామ్ నుంచి క్షేత్రాన్ని చేరుకోవడానికి సుమారు మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది. శ్రీశైలం డ్యాం ప్రవాహపు అందాలను చూడడానికి అందాలను చూడడానికి సందర్శకులు ఘాటురోడ్డు పక్కనే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో డ్యాం నుంచి శ్రీశైల క్షేత్రానికి చేరుకోవడానికి భక్తులకు నాలుగు గంటల సమయం పట్టింది.

నల్లమల ఘాట్‌లో కూలిన భారీ వృక్షం

ఆత్మకూరు: నల్లమల అటవీ పరిధిలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలోని బైర్లూటీ–రోళ్లపెంట మధ్య వర్షాలకు శనివారం రాత్రి భారీ వృక్షం నేలకూలింది. శ్రీశైలం – విజయవాడ – గుంటూరు – చీరాల వైపు నుంచి వచ్చే వాహనాలు, ఇటు కర్నూలు, అనంతపురం ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలిసిన వెంటనే ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిలు హుటాహుటిన ఆత్మకూరు నుంచి ప్రొక్లెయిన్ తీసుకెళ్లి నేలకూలిన భారీ వృక్షాన్ని పక్కకు తప్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

● కూలిన మట్టి మిద్దె

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో శనివారం మట్టి మిద్దె కూలింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సిద్దమల్లె బ్రహ్మయ్యకు చెందిన మిద్దె కూలిపోయింది. పగలు కావడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. మిద్దె కూలడానికి ముందు చిన్న శబ్ధం రావడంతో ఎలుకలు తిరుగుతున్నాయని భావించారు. అనంతరం శబ్ధాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు నలుగురు బయటకు పరుగులు తీశారు. వారు బయటకు రావడం మిద్దె కూలడం క్షణాల్లో జరిగిపోయింది. ఇంట్లో నుంచి ఏ సామాను తెచ్చుకోలేకపసోయారు. కట్టు బట్టలు మినహా అంతా మట్టిపాలైంది. నిత్యవసర సరుకులు, ఇంట్లో సామాగ్రి తదితర అంతా మట్టిలో కూరుకుపోయింది. ఎంపీడీఓ గోపీక్రిష్ణతో కలిసి ఎమ్మెల్యే జయసూర్య కూలిన మిద్దెను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి పక్కా గృహం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.



వర్షం తాకిడికి నేల మట్టమైన మట్టిమిద్దె

పాములపాడు: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం 32.4 మిమీగా వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ప్రధానంగా నల్లమల అడవి నుంచి ప్రవహిస్తున్న నీటితో ఇస్కాల భవనాశి, చెలిమిల్ల సుద్ద వాగు, వేంపెంట నిప్పుల వాగులు ఉధ్రుతంగా ప్రవహించాయి.

ఎద్దులేరు వాగును పరిశీలించిన డీఎస్పీ

కొత్తపల్లి: కుండపోత వర్షానికి మండలంలోని ఎం.లింగాపురం, శివపురం గ్రామాల మధ్య ఉప్పొంగి ప్రమాద కరంగా ప్రవహిస్తున్న ఎద్దులేరు వాగును శనివారం సాయంత్రం ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుండా చర్యలు చేపట్టాలని, వాహనాల రాకపోకలను నివారించాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ వెంట ఏఎస్‌ఐ బాబాపక్రుద్దీన్, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ ఉన్నారు.



ఎద్దులేరు వాగు నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ

ఆత్మకూరులో 30.6 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలం, పట్టణంలో తుపాను ప్రభావంతో శనివారం కురిసిన వర్షం 30.6 మి.మీ. నమోదయ్యింది. మండలంలోని సుద్ద వాగు, బవనాసి నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. మండలంలో రికార్డు స్థాయిలో సాధారణం కంటే అత్యధికంగా కురుస్తున్నాయి. మరింతగా వర్షం కురిస్తే గుండ్లకొండ వాగు నిండి కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఇటీవల వేసిన పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.







ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ బాబాఫక్రుద్దీన్, గువ్వలకుంట్ల పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు, బన్నూరు వద్ద మిరప చేనులో నిలిచిన వర్షం నీరు, శ్రీశైలంలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు, నేలకూలిన వృక్షాన్ని తప్పిస్తున్న ఆత్మకూరు పోలీసులు

వేంపెంటలో నిరంతరం డాక్టర్ ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి


పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామాన్ని నిరంతరం డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలని వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపెంట గ్రామంలో కలుషిత నీరు తాగి చాలా మంది అతిసార వ్యాధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితులు దాపురించాయన్నారు. అతిసారతో మృతి చెందిన బోయ లక్ష్మిదేవి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలన్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి తాగునీటి కొరకు పైప్ లైన్ నిర్మాణం చేపట్టి గ్రామానికి సరఫరా చేయాలని కోరారు.

సన్మానం



బాలకృష్ణయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ బాల కృష్ణయ్య పదవీ విరమణ పొందారు. ఈ మేరకు శనివారం స్థానిక వెన్నెల గార్డెన్స్‌లో వైద్యులు దీపానాగవేణి, మహమ్మద్‌బేగ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మలేరియా అధికారి రామనాథం, జోనల్ మలేరియా అధికారి లక్ష్మణ్ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్ తదితర ఉద్యోగులు బాలకృష్ణయ్యకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. బాల కృష్ణయ్య ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో 104 ప్రోగ్రాం అధికారి జగదీష్ చంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ అధికారి విశ్వేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రారెడ్డి, వైద్యాధికారులు జుబేదా, విజయేంద్ర, వినోద్ కుమార్, జగదీష్, హాకీమ్ రషీద్,షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో నోటితో పిల్లను వేరే చోటికి తీసుకెళ్తున్న శునకం

అమ్మ... అమ్మే!

అమ్మ ఎవరికైనా అమ్మే అని నిరూపించిందో శునకం. మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో శనివారం ఎడతెరిపిలేని వర్షంలో ఓ శునకం పసి కూనలు తడిసిపోతున్నాయి. చలించిన తల్లిశునకం వర్షం పడని ప్రదేశానికి తన పసిపిల్లలను నోటితో పట్టుకుని తీసుకెళ్లి అమ్మప్రేమను చాటుకుంది. మనుషుల్లోనైనా... జంతువుల్లోనైనా అమ్మతనం ఒక్కటే అనేందుకు ప్రత్యక్ష సాక్ష్యం ఈ శునకం. – కొత్తపల్లి

వైద్య సేవల్లో అలసత్వం వద్దు



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ శబరి

పాములపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అలసత్వం వహిస్తున్నారని, పద్ధతి మార్చుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీ డాక్టర్ శబరి హెచ్చరించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఎంపీ తనిఖీ చేశారు. అదేవిధంగా వేంపెంట గ్రామంలో అతిసారా వ్యాధి భాదితులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రస్తుతం పరిస్థితుల గురించి ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కాంతారావునాయక్, డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా, ఆర్డీఓ దాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పాములపాడుకు చెందిన సునీత ప్రసవంలో వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగా శిశువు మృతి చెందిందని అన్నారు. తదనంతరం అతిసారాతో మృతి చెందిన బోయ లక్ష్మిదేవి కుటంబ సభ్యులను పరామర్శించారు. రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా పాములపాడు, యర్రగూడూరు, వేంపెంట గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాలో శనివారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎంపీ శబరి హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట



సమావేశంలో వైస్ ఎంపీపీ లక్ష్మిదేవి

ఆత్మకూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నీరు కలుషితం కాకుండా, ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల జ్వరాలు, అతిసారా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటిపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు శుభ్రం చేయించాలని సూచించారు. ఎంపీడీఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు జారీ చేయాలన్నారు. గ్రామాల్లో మంచినీరు, అంతర్గత రహదారులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు మినుము విత్తనాలను సబ్సిడీలో అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ యేడాది మండలంలో అత్యధికంగా వర్షాలు కురవడంతో 1370 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతినిందని, వాటి నష్టపరిహారం కోసం ఇప్పటికే ఈ క్రాప్ పూర్తి చేశామన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ఈ క్రాప్ నమోదుకు అవకాశం ఉందన్నారు. మండల వైద్యాధికారి పవన్ కుమార్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఆర్వో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు మెరుగుపరచాలి

ఆత్మకూరు: వ్యాధుల తీవ్రతను పరిగణలోకి తీసుకుని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర జిల్లా వైద్యాధికారులను కోరారు. వారు మాట్లాడుతూ వర్షాలు అధికంగా పడుతుండంతో దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు విష జ్వరాలు, అంటురోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే సౌకర్యాలు సరిగా లేవన్నారు. దీంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నాన్నారు. వ్యాధుల తీవ్రతను బట్టి వైద్య పరీక్షలు, మందులు, మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

మిడుతూరు: మండలంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అంజద్ బాషా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటి వెళ్తున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను ఉప్పలదడియ వద్ద ఆటో ఢీ కొట్టడంతో కాలు విరగడంతోపాటు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితుడిని చూపుతున్న ఎస్‌ఐ తిరుపాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు. కేసీ కెనాల్ వెంట బైక్‌పై సంచిలో 96 తెలంగాణ మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. బైక్‌తోపాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన జిల్లెల బోయ నరసింహులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమి పుజ చేస్తున్న మల్లికార్జునరావు

మిడుతూరు: స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వెలుపల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయనున్న భారీ అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శనివారం వేదపండితుడు, శ్రీదత్త ఆశ్రమ వ్యవస్థాపకుడు జూలకంటి మల్లికార్జునరావు, గ్రామపెద్దలు కాతా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధార్మిక గుణాన్ని అలవరుచుకోవడంతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాలన్నారు. అనంతరం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి గ్రామ పెద్దలు నాగిరెడ్డి, భూమా క్రిష్ణమోహన్,, రామ్మోహన్, వడ్డె నాగేష్, క్రిష్ణన్న గౌడ్, శివకిరణ్, కటకం వెంకటేశ్వర్లు, కేశాలు, డాలు నాగరాజు, తిప్పన్న గారి శ్రీనివాసులు, డాలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరస్వామికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి శనివారం త్రయోదశి సందర్భంగా శాస్త్రోక్తంగా అర్చకులు పరోక్షసేవను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. నందీశ్వర పరోక్షసేవలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి మొత్తం 28మంది భక్తులు పాల్గొన్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలు నిర్వహించారు. స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి,నూతన వస్త్రసమర్పణ, విశేషార్చనలు, నానబెట్టిన శనగలను నైవేద్యాన్ని సమర్పించారు.

చెరువులో పడి మహిళ మృతి

బొమ్మలసత్రం: మహానంది మండలం గోపవరం గ్రామంలో ప్రమాదవశాత్తూ ఓ మహిళ చెరువులో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోపవరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (42) శనివారం పశువులు కాసేందుకు బీడు పొలాల వైపు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో పశువులు సమీపంలోని చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో అదుపుతప్పి నీటిలో పడిపోయింది. స్థానికులు గుర్తించి బయటకు తీసేలోపే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు:అతిసారా వ్యాధితో బాధపడుచున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట గ్రామాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షాలతో మాట్లాడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతిసారతో మృతి చెందిన లక్ష్మిదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా చౌట్కూరు గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసు, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఏఈ అనిల్, నందికొట్కూరు మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, సర్పంచ్ మాణిక్యమ్మ, మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.